సాక్షి సిద్దిపేట

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024

నాచగిరిలో భక్తుల సందడి

నాచగిరి లక్ష్మీ నృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, ఆదివారం కలిసి రావడంతో భక్తులతో సందడిగా మారింది. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. మండుటెండలను సైతం లెక్కచేయక నృసింహుని సన్నిధానం చేరుకున్నారు. ఆలయ పుష్కరిణి, హరిద్రానది వాగులో పుణ్యస్నానాలాచరించారు. లక్ష్మీ సమేత స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ అన్నపూర్ణ, సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. - వర్గల్(గజ్వేల్)



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో స్వామివారు



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి (ఇన్‌సెట్‌లో) స్వామివారు

కోరమీసాల స్వామికి కోటిదండాలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. అభిషేకాలు, పట్నాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. అలాగే ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టారు. కొండపైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే.. నగరానికి చెందిన భక్తుడు బాదం, కాజు, యాలకులతో ప్రత్యేక మాలను తయారు చేయించి స్వామివారికి అలంకరించారు. - కొమురవెల్లి(సిద్దిపేట)

న్యూస్‌రీల్

మల్లన్న ఆలయ ఉద్యోగి ఎట్టకేలకు రిలీవ్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో ఓ ఉద్యోగి ఎట్టకేలకు విధుల నుంచి రిలీవ్ అయ్యారు. 2021 సెప్టెంబర్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అతని డిప్యుటేషన్ కాల పరిమితి 2023 సెప్టెంబర్‌తో ముగిసింది. అయినా కొంత మంది అధికారుల అండతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల అతణ్ని రిలీవ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఎట్టకేలకు ఈవో బాలాజీ ఆదివారం రిలీవ్ చేశారు.

కవయిత్రి సుజాతకు మయూరి అవార్డు



అవార్డుతో కవయిత్రి సుజాత

దుబ్బాక: మున్సిపల్ పరధిలోని లచ్చపేటకు చెందిన ప్రముఖ కవయిత్రి ఎర్రగుంట సుజాతకు మయూరి అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ వరించింది. త్యాగరాయ గానసభ హైదారాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో సుజాత రాసిన కవితకు అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే సాహిత్య సేవకు నగదు బహుమతి లభించింది. ఆదివారం నగరంలోని త్యాగరాయ గానసభలో అవార్డు, గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు.

అంతక్కపేటలో పురుషుల పొదుపు సంఘం ఏర్పాటు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని అంతక్కపేటలో నూతనంగా పురుషుల పొదుపు సంఘం ఏర్పాటైంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పొదుపు సంఘం అధ్యక్షుడిగా జంగపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొయ్యడ క్రాంతిలతో పాటు డైరెక్టర్లను నియమించారు. ఈ పొదుపు సంఘంలో దాదాపు 270మంది సభ్యులుగా చేరారు. ప్రతి నె రూ.100 చొప్పున జమ చేసేలా నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు నేడే ఆఖరు



ఓటరు కార్డు నమూనా

మెదక్ కలెక్టరేట్: అర్హులైన యువతీ, యువకులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకునేందుకు నేడే చివరి అవకాశం. ఈనెల 16న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి కొనసాగుతున్న నూతన ఓటరు నమోదు ప్రక్రియ నేటితో ముగియనుంది. ఈనెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండి ఇంకా ఓటరు జాబితాలో పేరు లేని వారు ఎన్నికల సంఘం సూచించిన నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు. అలాగే మొబైల్‌లో ప్లే స్టోర్ నుంచి ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫారం - 6 నింపి పేరు నమోదు చేసుకోవచ్చు. నమోదు ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో కూడా పరిశీలించుకోవచ్చు. ఓటరు తమ నివాస ప్రాంతాన్ని మార్చుకునేందుకు ఫారం -8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నూతన ఓటర్లు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది. బీఎల్‌ఓ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం నమోదయ్యే ఓటర్ల పేర్లను ముద్రించి ప్రత్యేక ఓటరు జాబితాను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇప్పటికే స్వీప్ ఆధ్వర్యంలో విస్తృతస్థాయిలో ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 13వ తేదీ వరకు 2,143 దరఖాస్తులు రాగా వాటిలో అర్హులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు.

అగ్నిపరీక్షే!

ఎన్నికల వేళ నేతలకు కీలక బాధ్యతలు



- ఓటింగ్ శాతం పెంచుకునే దిశలో ప్రధాన పార్టీలు
- అధికార పార్టీలో నామినేటెడ్ పోస్టులపై ఆశలు
- మరోవైపు వర్గపోరుతో కార్యకర్తల్లో అయోమయం

సాక్షి, సిద్దిపేట: లోక్‌సభ ఎన్నికలు వివిధ పార్టీల నేతలకు అగ్నిపరీక్షలా మారాయి. ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యతలు అప్పగించడంతో ప్రచారంలో తలమునకలై ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు, అలాగే పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులకు ఆయా పార్టీలు కీలక బాధ్యతలు అప్పగించాయి. ఓటింగ్ శాతం పెంచేలా దిశానిర్దేశం చేశాయి. అధికార పార్టీ మరో అడుగు ముందుకు వేసి సక్సెస్ అయిన నేతలకు నామినేటెడ్ పోస్టులంటూ ఆశలు రేకెత్తిస్తోంది. దీంతో ఎవరికి వారు అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. అయితే కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో విభిన్న పరిస్థితులు నెలకొనడం గమనార్హం. ప్రధాన పార్టీలన్నీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయాలు రంజుగా మారాయి.

పట్టుదలతో కాంగ్రెస్ శ్రేణులు..

అధికార కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గతంలో కంటే మెజారిటీ ఓట్లు సాధించి ఈ లోక్‌సభ ఎన్నికల్లో జెండా ఎగురవేయాలనే పట్టుదలతో కాంగ్రెస్ శ్రేణులు పయనిస్తున్నాయి. ఆరు చోట్ల ఓటమి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. వారంతా ఓటింగ్ శాతం పెంచుకొని నామినేట్ పోస్టులు దక్కించుకోవాలనే ఉత్సాహం కనబరుస్తున్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ నేతలు వర్గాలుగా విడిపోయారు. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ పలుమార్లు పర్యటిస్తున్నా ఆ నాయకులను ఏకం చేయలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో సిద్దిపేటలో కార్యకర్తలు ఎవరివైపు వెళ్లాలో తేల్చుకోలేకపోతున్నారు.

మోదీ నినాదంతో బీజేపీ నేతలు

అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని ప్రచారం చేస్తూ 'మరో మారు మోదీ' అనే నినాదంతో బీజేపీ నేతలు ముందుకెళ్తున్నారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు గెలుపు కోసం ఆ పార్టీలో అందరూ కష్టపడుతున్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ శ్రేణులు ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నాయి.

ఆరు చోట్ల బీఆర్‌ఎస్ గెలుపు

మెదక్ పార్లమెంట్ పరిధిలో 7అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అందులో బీఆర్‌ఎస్ ఆరు చోట్ల, కాంగ్రెస్ ఒక చోట గెలుపొందాయి. బీఆర్‌ఎస్ పార్టీ సిద్దిపేట నుంచి హరీశ్‌రావు, గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్, దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి చింతా ప్రభాకర్, పటాన్‌చెరు మహిపాల్ రెడ్డి, నర్సాపూర్‌లో సునీతారెడ్డి, మెదక్ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ 6,68,955, కాంగ్రెస్ 4,20,881, బీజేపీ 2,11,626, ఇతరులు 1,36,435 ఓట్లు సాధించాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లు ఇలా..

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ
సిద్దిపేట	1,05,514	23,206	23,201
దుబ్బాక	97,879	25,235	44,366
గజ్వేల్	1,11,684	32,568	66,653
మెదక్	76,969	87,126	13,657
సంగారెడ్డి	83,112	74,895	20,921
పటాన్‌చెరు	1,05,387	98,296	19,963
నర్సాపూర్	88,410	79,555	22,865

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

- రాజ్యాంగం దేశ భవిష్యత్‌కు దిక్సూచి
- మంత్రి పొన్నం ప్రభాకర్



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా మారిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా చౌరస్తాలో విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా ఎన్నికలు జరుపుకోవాలని రాజ్యాంగంలో చేర్చిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. వెనుకబడిన వర్గాలకు సమ న్యాయం దక్కాలంటే రిజర్వేషన్ ప్రక్రియ ఉండాలని ఆకాంక్షించారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, వివిధ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

తాటి, ఈత వనాల పరిశీలన

హుస్నాబాద్ పట్టణ శివారులో అగ్ని ప్రమాదానికి గురైన తాటి, ఈత వనాలను ఆదివారం మంత్రి పరిశీలించారు. ప్రమాదం జరిగిన ఘటనపై గీత కార్మికులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాటి, ఈత వనాలు కాలిపోవడంతో ఉపాధి కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తా లేక కుట్రపూరితమా? అనేది ఎక్సైజ్, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధి హామీ పథకం కింద చెట్లు పెట్టే కార్యక్రమం, నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయండి

- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి
- బెజ్జంకిలో వ్యవసాయ మార్కెట్ సందర్శన
- అధికారులకు దిశానిర్దేశం



కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

బెజ్జంకి(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. ఆదివారం బెజ్జంకి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు వివరాలతో పాటు ఐరిష్ తీసుకోవడంతో దళారీలకు చెక్ పెట్టవచ్చని కలెక్టర్ అన్నారు. డబ్బులు సైతం వారి ఖాతాల్లో తొందరగా జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రం నిర్వాహకులు, హమాలీలతో మాట్లాడి ధాన్యం నిలువ లేకుండా వెంట వెంటనే తరలించాలని సూచించారు. ఎండలు అధికమవుతున్నందున రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్, సివిల్ సప్లై డీటీ రాజిరెడ్డి, మార్కెట్ కార్యదర్శి వెంకటయ్య, సూపర్‌వైజర్ గంగారాం, సీసీ పారయ్య, వీవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ మనుచౌదరి నిర్వాహకులకు సూచించారు. ఆదివారం పెద్దకోడూరులో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురిస్తే టార్పాలిన్ కవర్లతో ధాన్యాన్ని కాపాడుకోవాలన్నారు. ధాన్యం తేమశాతం పరిశీలించి, ధాన్యాన్ని సేకరించాలని నిర్వాహకులకు సూచించారు.

నా జీవితం తెల్ల కాగితం

- ఫిర్యాదులతో బెదిరేదిలేదు
- అబద్ధాలకోరు రఘునందన్
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఫైర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

వర్గల్(గజ్వేల్): దుబ్బాక ఉపఎన్నికలో గెలవడానికి వంద అబద్ధాలు ఆడిన రఘునందన్‌రావుకు ఎంపీ ఎన్నికల్లో ఓటు ద్వారా పాతరేసి తగిన గుణపాఠం చెప్పాలని ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గౌరారం వద్ద వర్గల్, ములుగు మండలాల పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తన జీవితం తెల్లకాగితం లాంటిదని, ఎవరికి భయపడబోనన్నారు. ఎన్నికల్లో గెలిచే సత్తాలేని రఘునందన్ ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకుల ఉద్యోగాలను ఊడగొట్టి ఉసురు పోసుకోవద్దని, నీతిమాలిన రాజకీయాలకు పాల్పడవద్దన్నారు. తెలంగాణకు ముందు, స్వరాష్ట్రం వచ్చిన తరువాత గజ్వేల్ ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలన్నారు. ఉమ్మడి మెదక్‌జిల్లా కలెక్టర్‌గా తనకు ఖ్యాతి తెచ్చిందని, ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటా, జీవితాంతం సేవచేస్తానని స్పష్టం చేశారు. బహుళ ప్రయోజనాలు ధ్యేయంగా ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, ప్రాజెక్టులతో కొందరు నష్టపోయారన్నారు. ఎంపీగా గెలిచిన తరవాత తాను ఏర్పాటు చేసే ట్రస్టు ద్వారా ముంపు బాధితుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మతాలు, కులాల పేరిట ఓట్లు అడిగే వారి మాటలు నమ్మొద్దని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలుచేయకుండా మోసం చేసిందన్నారు. గజ్వేల్ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని తిన్న రేవు మరువొద్దని, ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు జహంగీర్, మాదాసు శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, వర్గల్, ములుగు ఎంపీపీలు లతరమేష్‌గౌడ్, లావణ్యఅంజన్‌గౌడ్, జెడ్పీటీసీలు బాలూయాదవ్, జయమ్మఅర్జున్‌గౌడ్, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్‌చైర్మ న్ నరేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ రాష్ట్ర నేత జుబేర్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాపన్నపేట(మెదక్): వనదుర్గా నీకు వందనమమ్మా అంటూ వేలాది మంది భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు మంజీరా పాయల్లో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ మోహన్‌రెడ్డి, పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ చర్యలు తీసుకున్నారు.



ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ

మహిళా శక్తిని చాటాలి

- వాసవీక్లబ్ సేవలు అభినందనీయం
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: మహిళలు తమ శక్తి, సామర్థ్యాలను చాటాలని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ వాసవిక్లబ్, మహిళా విభాగం ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, వ్యాపార రంగాలతో పాటు సామాజిక సేవలో ఆర్యవైశ్య మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యుల కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా వాసవీక్లబ్ అధ్యక్షుడిగా జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలిగా శారదలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్‌గుప్త, జిల్లా అధ్యక్షుడు కాసం నవీన్‌గుప్త, గవర్నర్ డాక్టర్ సుధారాణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, రాష్ట్ర కార్యదర్శి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తరువాత కారు ఖాళీ

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

కొండాపూర్(సంగారెడ్డి): లోక్‌సభ ఎన్నికల తరువాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో మెదక్ లోక్‌సభ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు రైతుబంధుపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు బిచ్చం వేసినట్లుగా పూటకోసారి రైతుబంధు వేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ ఏక కాలంలో డబ్బులు వేశామని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో కేసీఆర్ కుటుంబమంతా పగటి వేషగాళ్ళ మాదిరిగా రోడ్లపైకి వస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో అనేక నిర్బంధాలకు గురయ్యామని పేర్కొన్నారు రాజకీయ ప్రస్థానంలో ఎన్నో అక్రమ కేసుల నమోదు, జైలుకెళ్లామని తెలిపారు. జనాల్లో ఉన్నాం.. అందుకే ప్రజలు ఆదరించి మళ్లీ పట్టం కట్టారన్నారు.

కేసీఆర్ సభతో దిమ్మ తిరగాలి

- బీజేపీ, కాంగ్రెస్‌కు వణుకు పుట్టాలి
- కార్యకర్తల సమావేశంలో హరీశ్
- సింగూరు చౌరస్తా వద్ద ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీశ్

సంగారెడ్డి: అందోల్ ప్రాంతంలో ఈనెల 16న జిల్లాలో నిర్వహించే కేసీఆర్ సభను చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు దిమ్మ తిరగాలని, ఈ సభకు లక్షన్నర జన సమీకరణ చేయాలని నాయకులకు, కార్యకర్తలకు మాజీ మంత్రి హరీశ్ దిశానిర్దేశం చేశారు. ఆదివారం సింగూర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన సభా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ..రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతాంగం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. బీజేపీ స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తా అని మాట తప్పిందన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఖ్వాజా వెంకట్ దాస్ చిష్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

టాస్క్ ఫోర్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని పలు ఇళ్లపై దాడులు చేసి అక్రమ మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుబ్బాక మండలం రామక్కపేటలోని నాగరాజు ఇంట్లో 30.925 లీటర్ల మద్యం బాటిళ్లను, గజ్వేల్ మండలం అక్కారంలోని నరేష్ ఇంట్లో 16.8 లీటర్ల మద్యాన్ని దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్‌కు చెందిన పోలీసు అధికారులు కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

రేకుల ఇంటిలో అగ్నిప్రమాదం



కాలిపోయిన సామగ్రి

హుస్నాబాద్: ఓ రేకుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన సంఘటన పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చవ్వ చాయ్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. తెల్లవారుజాము ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇంట్లోని విలువైన వస్తువులు, బియ్యం, బీరువాతో పాటు అందులో దాచిపెట్టుకున్న రూ.20వేలు నగదు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. తన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జూద స్థావరంపై దాడులు

అదుపులో ఎనిమిది మంది

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట శివారు తోటలో నడుపుతున్న పేకాట స్థావరంపై శనివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. కాగా 8 మందిని పట్టుకున్నారు. ఈ దాడిలో భారీ మొత్తంలో డబ్బు పట్టుబడ్డట్లు సమాచారం. ఇందుకు సంబంధించి కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌ను వివరణ కోరగా.. శనివారం విధుల్లో లేనన్నారు. తనకు ఏ వివరాలు తెలియవన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులే వివరాలు తెలియజేస్తారంటూ దాటవేత ధోరణిలో సమాధానమిచ్చారు. వారి పరిధిలో కేసు నమోదు కావాల్సి ఉండగా.. టాస్క్‌ఫోర్స్ వారు వివరాలిస్తారని చెప్పారు.

బెల్టుషాపులో దాడులు

నిర్వాహకుడిపై కేసు నమోదు

గజ్వేల్‌రూరల్: బెల్టు షాపులో విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని అక్కారంలో పట్టి నరేష్ బెల్టు దుకాణం నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నాడనే సమాచారం మేరకు ఆదివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడులు చేశారు. ఇందులో 16.8లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై కేసు నమోదు చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే 87126-67445, 87126-67446, 87126-67447 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

అంబేడ్కర్ జ్ఞానకేంద్రం ప్రారంభం

గజ్వేల్‌రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం గజ్వేల్‌లో అంబేద్కర్ జ్ఞాన కేంద్రం(లైబ్రరీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత ఉన్నత శిఖరాలను అధిరోహించినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు అట్కూరి రాములు, బొల్లారం ఎల్లయ్య, మాచపురం బాల్‌నర్సయ్య, సత్యనారాయణ, దమ్మని మల్లయ్య, టీపీటీఎఫ్ నాయకులు రాంచంద్రం, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికత

- టెక్నాలజీ వినియోగించి అధిక దిగుబడులు
- తగ్గనున్న ఖర్చు.. ఆదా కానున్న సమయం
- రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గతంలో ప్రతి ఇల్లు పశు సంపదతో కళకళలాడేది. కూలీల సమస్య తలెత్తేదికాదు. ప్రస్తుతం పశు సంపద తగ్గిపోయింది. కూలీల కొరత సరేసరి.. ఆపై వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయంటూ రైతులు సాగు చేపట్టడం లేదు. దీంతో కంపెనీల్లో, పట్టణాల్లో అడ్డా కూలీలుగా చేరుతున్నారు. దీన్ని చెక్ పెట్టేందుకు గాను.. సాంకేతికత జోడించి యంత్రాలను వినియోగిస్తే కూలీల సమస్య తీరుతుంది. దీంతోపాటు సమయం, ఖర్చు తగ్గించుకోవచ్చు అని కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులకు యంత్రాల వినియోగంలో శిక్షణ ఇస్తూ చైతన్యం చేస్తున్నారు. -కౌడిపల్లి(నర్సాపూర్)



తునికి కేవీకేలో కోనోవీడర్, వరికొయ్యలు కత్తిరించే యంత్రం శిక్షణ తీసుకుంటున్న రైతులు

వ్యవసాయంలో గతంలో మాదిరిగా మూస పద్ధతిలో రైతులు సాగు చేస్తే నష్టాలొచ్చే అవకాశం ఉందన్నారు. ఆధునిక పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, కలుపు నివారణ, చీడపీడలు, పురుగుల నివారణకు చిన్న, పెద్ద యంత్రాల వినియోగిస్తే సమయం, ఖర్చు తగ్గి కూలీల సమస్య తీరనుంది. రైతులు ఇప్పటికే ట్రాక్టర్, వరికోత యంత్రాలను వాడుతుండగా కొత్తగా ప్రభుత్వం, శాస్త్రవేత్తలు డ్రోన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు కోనోవీడర్, పవర్ టిల్లర్, విత్తనాలు విత్తే యంత్రం, వరికొయ్యలు కట్‌చేసే యంత్రం, గ్రాస్ కట్టర్, పవర్ వీడర్ తదితర యంత్రాలను వినియోగంచవచ్చు.

ట్రాప్ లైట్స్

వరి ఇతర పంటల్లో రైతులకు నష్టం కలిగించే రెక్కల పురుగు, గులాబీ రంగు పురుగు, ఇతర శత్రు పురుగుల నివారణ కోసం రాత్రిపూట దీపపు ఎరతో విద్యుత్, సోలార్ ట్రాప్‌లైట్లను ఏర్పాటు చేస్తే పురుగులు బాక్స్‌లో పడి వాటి సంతతి తగ్గుతుంది. దీంతో రైతుల నష్టం తగ్గుతుంది.

శిక్షణ ఇచ్చాం



వ్యవసాయంలో రైతులు సాంకేతికత వినియోగించాలి. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు కూలీల సమస్య నుంచి గట్టెక్కి సమయాన్ని ఆదా చేసుకోవాలి. వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు తదితర పంటలో యంత్రాలను వినియోగిస్తే కూలీల కొరత తీరుతుంది. దీంతో సమయం, ఖర్చు కూడా తగ్గుతుంది. రైతులకు క్షేత్రస్థాయిలో వారంపాటు శిక్షణ ఇచ్చాం.ఆచరించి అభివృద్ధి చెందాలని సూచించాం.

శ్రీనివాస్, తునికి కేవీకే శాస్త్రవేత్త

యంత్రాల వినియోగం

ప్రధానంగా రైతులు వరితోపాటు పత్తి, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు పంటలు సాగు చేస్తారు. వరిలో నారు పోసి నాట్లు వేసేందుకు కూలీల సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే రైతు డ్రంసీడర్ ద్వారా విత్తనాలు విత్తడం, వెద చల్లే పద్ధతిలో వరి విత్తనాలను నేరుగా నేలలో చల్లి సాగు చేస్తే కూలీల ఖర్చు తగ్గడంతోపాటు సమయం కలిసి వస్తుంది. కోనోవీడర్‌తో వరి సాలు వెంట పంట కాలంలో రెండు సారుల తిప్పడం ద్వారా కలుపు నివారణతోపాటు వేరు వ్యవస్థ బలపడి పిలకలు ఎక్కువగా వస్తాయి. దీంతో దిగుబడి పెరుగుతుంది. పత్తి కూరగాయల పంటలో పవర్‌టిల్లర్, పవర్ వీడర్, మినీట్రాక్టర్ వినయోగిస్తే కలుపు నివారించవచ్చు. కూలీల సంఖ్య తగ్గడంతో పాటు సమయం కలిసి వస్తుంది. పొలం గట్టుపై పెరిగే కలుపును గ్రాస్ కట్టర్ ద్వారా ఒక రోజులో మూడు నాలుగు ఎకరాలు తీయవచ్చు. వరికోతుల



శిక్షణ పొందిన రైతులు

హార్వెస్టర్ వినియోగం తరువాత చాలమంది రైతులు వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల సారం తగ్గుతుంది. దీని బదులుగా వరి కొయ్యలు కత్తిరించే యంత్రంతో వాటిని కట్ చేస్తే ఎరువుగా మారుతుంది. డ్రోన్ వాడితే గంటలో 4 ఎకరాల్లో పంటలో క్రిమిసంహార మందు, ఎరువులు స్ప్రే చేయొచ్చు.



వందవ పుట్టిన రోజు జరుపుకొంటున్న మధురవ్వతో కుటుంబ సభ్యులు

ఐదు తరాల వసంతం.. వెల్లివిరిసిన వేళ

- ఘనంగా వందవ పుట్టిన రోజు వేడుక
- సంబరాల్లో ముని మనవళ్లు, మనవరాళ్లు

నంగునూరు(సిద్దిపేట): ఐదు తరాల అనుబంధానికి గుర్తుగా నిలిచిన అమ్మకు వందవ పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకను ముని మనవళ్లు, మనవరాళ్లు నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. బంధు గణం, రక్త సంబంధీకుల మధ్య జరిగిన వేడుకతో ఆ ఇంట ఆనందం వెల్లివిరిసింది. నంగునూరు మండలం తిమ్మాయిపల్లికి చెందిన మధురవ్వ వందవ పుట్టిన రోజును ఆదివారం వేడుకగా జరిపారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు, కోడళ్లు ఒక్క చోట చేరడంతో పండుగ వాతావరణం నెలకొంది. మధురవ్వతో కేక్ కట్ చేయించి వేడుక నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదు తరాల తన బలగాన్ని చూసిన మధురవ్వ ఆనందంతో ఉప్పొంగిపోయింది. కార్యక్రమంలో కోడళ్లు లలితవ్వ, మల్లవ్వ, మనవళ్లు, మనవరాళ్లు చల్లారం మహేందర్‌రెడ్డి, శిరీష, అరుంధతి, ప్రభ, శోభ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ రూపంలో కబళించిన మృత్యువు

బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరి మృతి

మెదక్ మున్సిపాలిటీ: స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మెదక్ పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మెదక్ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం... నర్సి ఖేడ్ వీధికి చెందిన సల్మాన్ (35) స్కూటీపై బంధువులను బస్ డిపో వద్ద దించి తిరిగి ఇంటికి బయలుదేరాడు. వైన్స్ వద్దకు రాగానే వేగంగా వస్తున్న టిప్పర్.. బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సల్మాన్ తల పైనుంచి టిప్పర్ చక్రాలు వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.



● నోరూరించే మొర్రి



ఎండాకాలంలో ప్రత్యేకంగా చెప్పుకునే పండ్లలో మొర్రి పండు ఒకటి. ఇది కేవలం ఈ సీజన్‌లోనే దొరుకుతుంది. దీన్ని తినేందుకు పెద్దలు, చిన్నారులు ఆసక్తిని చూపిస్తారు. ముఖ్యంగా మిరుదొడ్డి, కాసులాబాద్‌లో అటవీ ప్రాంతంలో విరివిగా దొరుకుతాయి. కాగా ఈ పండ్లను కొందరు విక్రయిస్తూ ఉపాధిని పొందుతున్నారు. రోజుకు రూ. 4 వేల నుంచి 5 వేల వరకు సంపాదిస్తున్నారు. గ్రామాల్లో అయితే కొలిచి రూ. 20లు, పట్టణ ప్రాంతాల్లో రూ.40 నుంచి 60ల వరకు విక్రయిస్తున్నారు.

- మిరుదొడ్డి(దుబ్బాక)



మొర్రి పండ్లను విక్రయిస్తున్న మహిళ

బైక్ అదుపు తప్పి.. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి..

బైకిస్టు దుర్మరణం,
మరొకరికి గాయాలు
వర్గల్ సమీపంలో ఘటన



నర్సింహులు(ఫైల్)

వర్గల్(గజ్వేల్): బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా బైకిస్టు అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం వర్గల్ సమీపంలో జరిగింది. గౌరారం ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం .. అంబర్‌పేటకు చెందిన మన్నె నర్సింహులు(55), కీసరి దశరథ్ ఆదివారం వర్గల్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అనంతకుంటకట్ట వద్ద రహదారిపైకి రాగానే వాహనం అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా నర్సింహులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన దశరథ్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో రైతు.. రియల్ వ్యాపారుల మోసంతో మరొకరు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో ఆదివారం జరిగింది. భూంపల్లి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోటి మల్లయ్య (48) తనకు ఉన్న ఐదున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటున్నాడు. మెరుగైన వ్యవసాయం చేయడం కోసం రెండు బోర్లు తవ్వించాడు. అందులో అనుకున్న స్థాయిలో నీరు పడలేదు. వచ్చి రాని సాగు నీటితో వ్యవసాయ ముందుకు సాగడం లేదు. దీంతో అప్పుల ఊబిలో కూరుకు పోయాడు. కుటుంబపోషణ కూడా భారంగా మారింది. మరిన్ని అప్పులు చేశాడు. మొత్తంగా అసలు, మిత్తి కలిపి రూ. 6 లక్షల వరకు చేరింది. ఎండల దెబ్బకు ఎకరంన్నర పొలానికి సాగు నీరందక పోవడంతో పంట ఎండుముఖం పట్టింది. మరోవైపు మల్లయ్యకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. ఇలా అన్ని ఒకసారి మీద పడటం.. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక లోలోన మనస్తాపానికి గురై తన ఇంటి ఎదుట ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

మనస్తాపం చెంది..



రాజశేఖర్(ఫైల్)

దుబ్బాకరూరల్: తీసుకున్న ప్లాట్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని గంభీర్‌పూర్‌లో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం ప్రకారం... నీరటి రాజు(33) సిద్దిపేట పట్టణానికి చెందిన ఎండీ సలీం, ఎంఏ బాసిత్‌ల వద్ద స్మార్ట్ సిటీ వెంచర్లో సర్వే నంబర్ 1994లో ప్లాట్ నంబర్ 20లో 150 చదరపు గజాల ప్లాట్ కొన్నాడు. డబ్బులు చెల్లించి 4 నెలలు గడుస్తుందని రిజిస్ట్రేషన్ చేయించమని కోరాడు. అయినా వెంచర్ వ్యాపారులు అతని అభ్యర్థనను పట్టించుకోకుండా కాలయాపన చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై తన సొంతింటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు జేబులో ప్లాట్‌కు సంబంధించి మధ్య వర్తులైన మిరుదొడ్డి రాజు, చిన్నగుండవెల్లి లింగంతోపాటు సలీం, బాసిత్ పేర్లతో కూడిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. రాజు భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ రీఫిల్లింగ్ దందా గుట్టురట్టు

- భారత్ గోదాంపై పోలీసుల దాడులు
- వెలుగు చూసిన ఉదంతం

రాయపోలు(దుబ్బాక): గ్యాస్ రీఫిల్లింగ్ దందాను పోలీసులు గుట్టురట్టు చేశారు. అందిన సమాచారం మేరకు ఒక కంపెనీ గ్యాస్ గోదాంపై శనివారం దాడులు చేయగా ఈ విషయం వెలుగు చూసింది. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ గోదాంలో రాయితీ (డొమెస్టిక్) సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్‌ను రీఫిల్ చేస్తున్నారు. యథేచ్ఛగా సాగుస్తున్న ఈ దందా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం రాయపోలు ఎస్సై రఘుపతి సిబ్బందితో దాడులు చేశారు. దీంతో అక్కడ కమర్షియల్ సిలిండర్లపై రాయితీ సిలిండర్లను ఉంచి గ్యాస్‌రీఫిల్లింగ్ చేస్తుండటాన్ని గుర్తించారు. కమర్షియల్ సిలిండర్లను హైదరాబాద్‌లోని పలు హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకుని సరఫరా చేస్తున్నట్లు సైతం గుర్తించారు. ఈ మేరకు సిలిండర్లను సీజ్ చేసి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.



రాయపోలు భారత్ గ్యాస్ గోదాంలో రీఫిల్లింగ్ చేస్తున్న దృశ్యం

డ్రగ్స్, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలి

గజ్వేల్ పౌరసమాజం సభ్యులు

గజ్వేల్‌రూరల్: మద్యం, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని గజ్వేల్ పౌరసమాజం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా.. 'మార్పు కోసం... భవిష్యత్ వైపు' అనే నినాదంతో .. ''మద్యపాన నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలన''పై గజ్వేల్ పౌరసమాజం ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరస్థాయికి చేరుకుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థి, యువతను పెడతోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి వినియోగం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవ్వడంతో పాటు విలువైన జీవితాలు కోల్పోయి జైలుపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాలే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తరించిందన్నారు. యువత గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. మద్యపానం, మత్తుపదార్థాలపై నియంత్రణ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. వీటి నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మద్యపానం నియంత్రణతో పాటు మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ అంబదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామచంద్రం, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్, లింగం, తుమ్మ శ్రీనివాస్, చంటి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ చంద్రబోస్, యువజన సంఘాల నాయకులు దేశబోయిన నర్సింహులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

10 మంది వడ్డీ వ్యాపారులపై కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): 10 మంది వడ్డీ వ్యాపారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన రేణికుంట మహేందర్, గుండ సత్యరారాయణ, లింగంపల్లి కనుకరాజు, గౌరయపల్లికి చెందిన బొచ్చు దశరథం, పోసాన్‌పల్లికి చెందిన నిమ్మ మల్లారెడ్డి, కానుగంటి చంద్రశేఖర్, కిష్టంపేటకు చెందిన ఆకుల సత్తయ్య, పంజాల నర్సింహులు, పెద్దరాజుపేటకు చెందిన బొంగురం ఆగంరెడ్డి, బొజ్జ యాదగిరిలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. వారి నుంచి నగదు, ప్రామిసరీ నోట్స్, ఆభరణాలు తదితర పత్రాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వాటి ఆధారంగా విచారణ చేస్తున్నారు. కాగా, శనివారం అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారస్తుల ఇళ్లలో సోదాలు చేయడం తెలిసిందే.

బైరాన్‌పల్లి, లింగాపూర్‌ల్లో సోదాలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లి, లింగాపూర్ గ్రామాల్లో పలువురి వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అహ్మద్ అలీ మాట్లాడుతూ బైరాన్‌పల్లికి చెందిన జంగిటి మనోజ్ అనే వ్యాపారి ఇంట్లో అప్పు పత్రాలతో కూడిన ఓ డైరీ స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బైరాన్‌పల్లిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు జగ్గం రామస్వామి ఇంట్లో సోదాలు నిర్వహించారు. 11 బీరు సీసాలు లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



కౌసర్ బేగం

సిద్దిపేటరూరల్: ఇంట్లో గొడవపడి బయటికి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన సిద్దిపేట.. ఇర్కోడ్ దర్గా వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాళ్లకుంట కాలనీకి చెందిన కౌసర్ బేగం.. కుటుంబసభ్యులతో గొడవ పడి శనివారం బయటకు వచ్చింది. తర్వాత భర్త అమీర్‌కు ఫోన్ చేసి జరిగిన గొడవ గురించి చెప్పి, ఎక్కడున్నావని అడగగా ఇర్కోడు దర్గా దగ్గర ఉన్నానని చెప్పాడు. దీంతో అక్కడికి వెళ్లి కలిసింది. తన వెంట అమ్మ ఉందని ఇంటి వద్ద దించి వస్తానని చెప్పి అతను వెళ్లాడు. మరలా దర్గా వద్దకు వచ్చి చూస్తే ఆమె కనబడలేదు. దీంతో అమీర్.. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరికి ఘన నివాళి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి గ్రామానికి చెందిన దివంగత మాజీ ఎంపీటీసీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు పొల్కంపల్లి యాదగిరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు ఆయనకు నివాళులర్పించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో యాదగిరి విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. అలాగే తల్లిదండ్రుల పేరిట రూ.కోటితో ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. సంస్మరణ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. యాదగిరి కుటుంబం రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజాసేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సుమారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో యాదగిరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం

ఐదు గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్)లో ఆదివారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ ఫీడర్ పరిధిలోని కట్కూర్, దుబ్బతండా, చాపగానీ తండా, మోత్కులపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఐదు గంటలపాటు కరెంట్ సరఫరా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ హరీశ్‌రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు. రాత్రి 8 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కాలనీ నూతన కమిటీ ఎన్నిక

గౌరవ అధ్యక్షుడిగా ఆకుల సత్యనారాయణగౌడ్, అధ్యక్షుడిగా డాక్టర్ కిరణ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హరిహర రెసిడెన్సీ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల సత్యనారాయణగౌడ్, అధ్యక్షుడిగా డాక్టర్ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి అయిలయ్య, ఉపాధ్యక్షులుగా నర్సింహగౌడ్, రాజ్‌కుమార్, మల్లేశం, కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, దుర్గయ్య, సంతోష్‌కుమార్, ఆడిట్ కమిటీ సభ్యులుగా షాదుల్లా, కూరపాటి శ్రీనివాస్, పులి భోగేశ్వర్, గౌరవ సలహాదారులుగా శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణ, రాములు, లింగమూర్తి, సత్యంగౌడ్, తిరుపతిరావు, పీఆర్‌ఓగా నర్సింహారావు ఎన్నికయ్యారు.